# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- పండుగ వాతావరణంలో వైఎస్సార్ ఆసరా సదస్సు
- పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



సంబేపల్లె: మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


రాయచోటి: అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

సంబేపల్లె : వైఎస్సార్ ఆసరా పొదుపు సంఘాలకు బాసటగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన, ఎంపీపీ నాగశ్రీలక్ష్మి సారథ్యంలో జరిగిన మండల వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సదస్సులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. జగనన్న పాదయాత్రలో అక్కా చెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా మండలంలో వైఎస్సార్ నాల్గవ విడత కింద 543 సంఘాలకు రూ. 4,63,56,968 లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేదరికం తగ్గిందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతిపక్ష నేత తన నక్కజిత్తు తెలివితేటలను ప్రదర్శించడమే కాక పచ్చ మీడియాలో విషపు రాతలు రాయిస్తున్నారని ప్రజలు జాగృతిగా మెలగాలని గుర్తు చేశారు. సీఎం జగన్‌ను ఎదుర్కొనే దమ్ములేక పొత్తు రాజకీయాలకు తెరదీశారని చెప్పారు. తన హయాంలో చేసిన ఒక్క మంచి పని చెప్పగలరా అని చంద్రబాబును ప్రశ్నించారు.

**మంచి జరిగి ఉంటేనే జగన్‌కు అండగా నిలవాలి**

సీఎం జగన్ ప్రతి కుటుంబానికి మేలు చేశారు. ప్రతి ఇంటికి, రెండు, మూడు పథకాలు అందించి ఆర్థికంగా ఆదుకుని పేదల కుటుంబాలలో వెలుగులు నింపారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంచి జరిగి ఉంటేనే అండగా నిలవాలని తెలియజేశారు. చంద్రబాబు అధికారంలో నుంచి దిగిపోయే టప్పుడు రూ. 3.50 లక్షల కోట్లను అప్పులుగాను, రూ. 80 వేల కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారని, జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత రెండేళ్లు కరోనాతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఈ విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందజేసి పాలనలో నిదర్శనంగా నిలిచారన్నారు.

**జగన్‌కు రథసారథులు మహిళలే**

జగన్‌కు ప్రచార సారథులు మహిళలేనన్నారు. టిడిపి దగ్గర కౌరవ సైన్యం ఉందన్నారు. సీఎం జగన్ పద్మ వ్యూహంలో చిక్కుకునే అభిమన్యుడు కాదని అర్జునుడన్నారు. జగన్‌కు కృష్ణుడి రూపంలో అక్కా చెల్లెమ్మలు, పేద ప్రజలు ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వంపై తోడేళ్లు, గుంటనక్కలు, దుష్టచతుష్టయలు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలే తిప్పి కొట్టాలన్నారు. ప్రజల కష్టసుఖాలలో మీ బిడ్డగా, తమ్ముడిగా, అన్నగా, సేవకుడిగా, కుటుంబ సభ్యుడివలే తోడుంటానని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అనంతరం వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డి, రాయలసీమ విద్యా సంస్థల అధినేత ఆనందరెడ్డి, బసిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వి రమణారెడ్డి, వివి ప్రతాప్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ నరసింహులు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా కేంద్రం అభివృద్ధే ధ్యేయంగా..**

రాయచోటి: జిల్లా కేంద్రం అభివృద్ధే ధ్యేయంగా కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వాటిని పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలో రూ. 2 కోట్లతో చేపట్టిన సుందరీకరణ మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్‌లు దశరథరామిరెడ్డి, ఫయాజుర్ రెహమాన్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణంలోని వేంపల్లె క్రాస్ రోడ్డు, చిత్తూరు రహదారి మార్గంలోని రింగ్ రోడ్డువద్ద సుందరీకరణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేయించి మున్సిపల్ సహకారంతో టవర్ క్లాక్, 6 సర్కిళ్ల సుందరీకరణ పనులు ప్రారంభం కావడం హర్షనీయమన్నారు. మాసాపేట గుంత బజార్ ప్రజలతో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మమేకమయ్యారు. ప్రజల సమస్యలపై ఆరాతీశారు. రూ. 15 లక్షలతో గుంతబజార్ అంతా త్వరలో డ్రైనేజీ నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, కౌన్సిలర్లు సగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, జీఎండీ ఇమ్రాన్, ఇర్షాద్, కొలిమి చాన్ బాషా, ఫయాజ్ అహ్మద్, గౌస్ ఖాన్, అల్తాఫ్, గువ్వల బుజ్జిబాబు, కొత్తపల్లె ఇంతియాజ్, విక్కి దేవేంద్ర, జావీద్, అమీర్, ఖాదర్ వలి పాల్గొన్నారు.

## వారంలో ఒకరోజైనా ఉల్లాసంగా గడపాలి


మున్సిపల్ పార్కును ప్రారంభిస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్: ప్రస్తుతం ప్రతి ఒక్కరిది ఉరుకులు, పరుగులమయమైన జీవితం అయిందని, అందువల్ల ప్రతి ఒక్కరు వారంలో ఒక్క రోజైనా కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నూనెవారిపల్లె రోడ్డులో ఆధునీకరించిన మున్సిపల్ పార్కును బుధవారం ఆకేపాటి, పోలా ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ పార్కును ఆధునీకరించడం వల్ల మరింత ఆహ్లాదకరమైన వాతావరణం సంతరించుకుందన్నారు. పట్టణ ప్రజలు ఖాళీ సమయంలో పార్కుకు వచ్చి సంతోషంగా గడపాలన్నారు. రానున్న రోజుల్లో ఈ పార్కును మరింత అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శేషఫణి, ఆర్‌ఐ హరి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు అరిగెల సౌమిత్రి, గోవిందు బాలకృష్ణ, జీవీ సుబ్బరాజు, జ్యోతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు


వాహన తనిఖీలో అధికారులు

రాజంపేట : రహదారి భద్రత జీవితానికే రక్ష అని రాజంపేట ఎంవీఐ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం కడప – రేణిగుంట జాతీయరహదారిలోని రాజంపేట – కోడూరు రూట్‌లో రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా వాహనాలను తనిఖీలను స్థానిక డీఎం రమణయ్యతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు ప్రమాద నివారణ చర్యలు చేపట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలకు దూరమవుతారన్నారు. ఓవర్‌లోడులుతో ఆటోలను నడపరాదన్నారు. రోడ్డు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అనుసరించని మూడు వాహనాలను సీజ్ చేశామన్నారు. 11 మందిపై కేసు నమోదు చేశామన్నారు. రూ.29వేలు జరిమానాలు విధించామన్నారు. కార్యక్రమంలో డీఎం కార్యాలయం అధికారి మోడపోతుల రమణయ్య, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నందలూరు మండల సమావేశం రసాభాస


వివాదాన్ని సద్దుమనిగిస్తున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా కొనసాగింది. మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, మండల కో–ఆప్షన్ సభ్యులు కలీముల్లా ఖాన్ మధ్య నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శిథిలావస్థలో ఉన్న గొల్లపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాల సమస్యలపై ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం మండలంలోని అధికారులతో కలిసి అభివృద్ధి పనులపై చర్చ కొనసాగింది. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఎంపీపీ మండిపడ్డారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ సౌభాగ్యమ్మను ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉపాషాణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే


జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న గడికోట

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా అభిషిక్త్ కిశోర్‌కు రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియచేశారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన్ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించే విషయంలో పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా అభివృద్ధిని సమష్టి కృషితో సాధిద్దామని తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

### పదవీ విరమణ

రాయచోటి పరిధిలో పలువురు అధికారులు పదవీ విరమణ పొందారు. వారిని జిల్లా ఉన్నతాధికారులు, సహ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. పదవీ విరమణ పొందిన వారిలో హెల్త్ ఎడ్యుకేషన్ అధికారిగా సేత్ దేవప్రసాద్, స్కూల్ అసిస్టెంట్ మోనే నాగేంద్ర రావు, ఉపాధ్యాయురాలు రమణమ్మ, ఫైర్ ఆఫీసర్ బాల హుస్సేనయ్య, ఎంఎస్ జైనుల్లా, ఏఎస్‌ఐ రమేష్ బాబులు ఉన్నారు.







పదవీ విరమణ పొందుతున్న పోలీస్ అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ కృష్ణారావు

## రైతులు ఉద్యాన అధికారుల సలహాలు పాటించాలి

సిద్దవటం : మామిడి తోటల రైతులు ఉద్యానాధికారి సలహాలను తప్పనిసరిగా పాటించాలని బద్వేల్ ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని జ్యోతి, పొన్నవోలు, వంతాటిపల్లి, ఎస్.రాజంపేట గ్రామాల్లోని మామిడి తోటలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రాత్రి ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటం వల్ల మామిడిలో పూత కొంత ఆలస్యంగా వస్తుందన్నారు. మామిడి రైతులు నిపుణుల సలహాల మేరకు పూతకు రాని తోటలలో మల్టీ – కే(13:00.45–10గ్రాములు)+జింక్( 1.5 గ్రాములు)+బోరాన్(1 గ్రాము)లీటరు నీటికి కలిపి కచ్చితంగా పిచికారీ చేయాలన్నారు. పూత మొగ్గ దశలో ఉన్నప్పుడు తేనె మంచుపురుగు, వివిధ రకాల పురుగుల నివారణకు మోనో క్రోటోఫాస్ (1.6 మి.లీ) తెగుళ్ల నివారణకు మాంకోజెబ్ (2గ్రాములు ) లేదా కార్బెన్‌డిజమ్ (1 గ్రాము), వేప నూనె (2–3 మి.లీ. ), ఆర్కా మాంగో స్పెషల్ ( 5 గ్రాములు), జిగురు(0.3 మి.లీ.)లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. రెండవ పిచికారీలో బుప్రోఫుజెన్ (2 మి.లీ. ) లేదా బుప్రోఫుజెన్+అసిఫాట్ (1 గ్రాము) హెక్సాకోనజోల్ (2 మి,లీ.) లేదా మాంకోజెబ్+కార్బెన్‌డిజమ్ (1.5 గ్రాములు)బోరాన్ (1 గ్రాము)తో పాటు జిగురు (0.3 మి.లీ.) కలిపి పిచికారీ చేయాలన్నారు. మొదటి పిచికారీలో జింక్ లేదా బోరాన్ కలపక పోతే రెండవ పిచికారీలో కలిపి పిచికారీ చేస్తే పూత మరియు పిందె బాగా నిలబడుతుందన్నారు. తేనె మంచు పురుగును సమర్థవంతంగా నివారించటం కోసం ఒక్కో మామిడి చెట్టుకు పసుపు రంగు జిగురు అట్టలను వేలాడ దీయాలన్నారు. మామిడి రైతుల సలహాల సూచనలకు సంబంధిత రైతు భరోసా కేంద్రంను సంప్రదించాలని ఉద్యానాధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి రైతులు పాల్గొన్నారు.

### చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలి

రాయచోటి టౌన్ : చట్టాలపై మహిళలకు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఈ.ప్రసూన అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని శివ నర్సింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన చట్టాలపై మహిళలకు అవగాహన అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ సమాజంలో అత్తింటి వేధింపులు, హింసలు వంటివి అనేకం జరుగుతుంటాయన్నారు. వాటిని అవగాహనతో స్పందించి కోర్టు ద్వారా న్యాయం పొందాలని కోరారు. మహిళలకు ఎన్నో రకాల చట్టాలు ఉన్నప్పటికీ వాటిపై అవగాహన లేదన్నారు. వీటిని తెలుసుకొని హింస తదితర సందర్భాల్లో వారు రక్షణ పొందలన్నారు. 14 సంవత్సరాలలోపు చిన్నారులతో పనులు చేయించడం బాల కార్మికుల చట్టం కింద శిక్షలు ఉంటాయని చెప్పారు. న్యాయవాదులు రామాంజనేయులు, ఎం.నాగేశ్వరావు, డి.నాగముని, అర్బన్ ఎస్‌ఐ భక్తవత్సలం, చైర్మన్ ఎం. భాస్కర్‌లు పాల్గొన్నారు.

### తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

పుల్లంపేట : తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని చీని, నిమ్మ పంటలను అనంతరాజుపేట ఉద్యానకళాశాల తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె దినేష్, రైల్వేకోడూరు ఉద్యాన అధికారి ఎం భాస్కర్‌లు సందర్శించారు. అనంతరం ఆయా తోటలలో అధికంగా ఆశించే సిట్రస్ గ్రీనింగ్, గజ్జి తెగులు, వైరస్ వ్యాధులు గురించి ఉద్యాన రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను తెలియజేశారు. అదే విధంగా ఈ మధ్యకాలంలో చీని, నిమ్మ పంటలలో సిట్రస్ గ్రీనింగ్ వ్యాధి ఉధృతి ఎక్కువగా ఉందని, ఈ వ్యాధి వాహకం అయినటువంటి డయాఫోరిన సిట్రి (సిల్లిడ్) అని, అరికట్టడానికి చేపట్టాల్సిన నివారణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్, గ్రామ ఉద్యాన సహాయకులు, ఉద్యాన రైతులు పాల్గొన్నారు.

### ఆర్టీసి అభివృద్ధిలో అందరి పాత్ర

రాయచోటి అర్బన్ : ఆర్టీసీ అభివృద్ధిలో ప్రతిఒక్కరి పాత్ర ఉందని ఏపీఎస్‌ఆర్‌టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి రాము అన్నారు. బుధవారం జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో వారు ఏపీపీటీడీ జిల్లా క్లాస్–2 సూపర్‌వైజర్స్ 2024 డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చలపతి, హరిక్రిష్ణ, లోకనాథం, ఫణిభూషణ్, గీత, రేవతి, సుధాకర్, ధరణిబాబు, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆకస్మిక మృతి


జ్యోతీశ్వరబాబు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మేడా

రాజంపేట : వైఎస్సార్‌సీపీ సీనియర్ బీసీ నేత నల్లబోతుల జ్యోతీశ్వరబాబు (59)బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. హైదరాబాదులోని స్టార్ హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ మృతి చెందారు. జ్యోతి మృతిపై జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా, పీసీ యోగీశ్వరరెడ్డి, కృష్ణారావుయాదవ్, గండికోట గుల్జార్‌బాషా, బీసీ నేతలు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియచేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆస్పత్రి చేరుకొని మృతదేహం వద్ద కన్నీటి పర్యంతం అయ్యాడు. ఓ మంచి మిత్రుడిని కోల్పోయానని తెలియజేశారు.

### బహుజన సదస్సును జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : మదనపల్లె పట్టణంలో ఫిబ్రవరి 3న నిర్వహిస్తున్న బహుజన రాజ్యాధికార సదస్సును జయప్రదం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు యుగంధర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గల అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద ఆయన బహుజన రాజ్యాధికార సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు అబ్బవరం నాగేశ్వర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నియమాలు పాటించండి

రాయచోటి టౌన్ : ట్రాఫిక్ నియమాలు పాటించండి – ప్రమాదాలను నివారించండని రాయచోటి ట్రాఫిక్ సీఐ మహబూబ్‌బాషా అన్నారు. బుధవారం జాతీయ భద్రతా వారోత్సవాలలో భాగంగా వీఆర్ టెక్నో స్కూల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## క్లుప్తంగా

### దరఖాస్తు చేసుకోండి

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ పరిధిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విభాగంలో 2024 – 25 సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వరప్రసాద్ తెలిపారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీ ఉంటుందన్నారు. అన్నమయ్య జిల్లాలో ఏ ప్రాంతాల వారైనా దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. వచ్చే నెల 23లోపు దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు 97045 50121కు సంప్రదించాలని తెలిపారు.

### గెలుపోటములు సహజం

సిద్దవటం : క్రీడాపోటీల్లో గెలుపోటములను క్రీడాకారులు సహజమని జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, వావిళ్ల శ్రీనివాసులరెడ్డిలు అన్నారు. మండలంలోని మాధవరం–1 గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ, మేడా బ్రదర్స్ ఆధ్వర్యంలో జరిగిన రాజంపేట నియోజక వర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంటు ఫైనల్ మ్యాచ్ బుధవారం మాధవరం–1, పార్వతీపురం జట్ల మధ్య జరిగింది. అనంతరం విజేతకు, రన్నర్‌కు మెమెంటోతోపాటు నగదు బహుమతిని అందజేశారు.

### క్రీడా స్థలం పరిశీలన

రామాపురం : మండల కేంద్రంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో క్రీడా మైదానాన్ని బుధవారం సమగ్ర శిక్షా బృందం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీధర్, ఏఈ జిలాని బాషాలు పరిశీలించారు. మాట్లాడుతూ పాఠశాలకు మైదానం లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి శ్రీ పథకం కింద మైదానానికి రూ.లక్ష నిధులు మంజూరు చేసిందన్నారు. మైదానంలో బాస్కెట్‌బాల్ కోర్టు, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు స్థలాన్ని పొందపరుస్తామన్నారు.

### 'ఖాళీ బిందెలతో నిరసన'కు స్పందన


చేతిపంపును రిపేర్ చేసిన అధికారులు

సిద్దవటం : మండలం లోని ముమ్మడిగుంటపల్లి ఎస్సీ కాలనీలో తాగు నీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన అనే శీర్షికపై సాక్షిలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. ముమ్మడిగుంటపల్లి ఎస్సీ కాలనీ మహిళలు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన తెలిపిన విషయం విదితమే. బుధవారం అధికారులు స్పందించి బుధవారం ఎస్సీ కాలనీలోని మాతమ్మ గుడివద్ద ఉన్న చేతి పంపును రిపేర్ చేయించి గ్రామస్తులకు తాగునీరు అందించారని గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

### రేపటి నుంచి దర్గా స్వామిజీ ఆరాధనోత్సవాలు

రామాపురం : మండల పరిధిలోని నీలకంఠ్రావుపేట సమీపంలో వెలసిన శ్రీ దర్బారు సమర్థ సద్గురు దర్గా స్వామిజీ ఆరాధన ఉత్సవాలు ఫిబ్రవరి 2, 3వ తేదిలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఆరాధనోత్సవాలలో భక్తులకు పెద్దసంఖ్యలో పాల్గొనాని కోరారు.

### నివాళి


నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల

ఓబులవారిపల్లె : వైఎస్సార్‌సీపీ నాయకులు కొలూరి రామచంద్రారెడ్డి(78) బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు నాయకులతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన గతంలో సింగల్‌విండో ప్రెసిడెంట్‌గా, రైల్వే డివిజన్ వినియోగదారుల కమిటీ సభ్యులుగా పనిచేశారు. ముగ్గురు కూమారులు కాగా కొలూరి మధుసూదన్‌రెడ్డి ప్రస్తుతం మంగంపేట ఉప సర్పంచ్‌గా ఉన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### అభినందన

రామాపురం : త్రో బాల్ విభాగంలో నేషనల్‌కు ఎంపికైన శ్రావణ్‌కుమార్‌ను రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. బుధవారం మండలంలోని కసిరెడ్డిపల్లె గ్రామం పాత మేదరపల్లె బంకు సుబ్బయ్య అన్నకుమారుడు శ్రావణ్‌కుమార్ ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపికైన శుభ సందర్భంగా అభినందించారు. ఆయనతో పాటు మండల నాయకులు ఉన్నారు.

### బాధ్యతల స్వీకరణ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండల ఎస్‌ఐగా సుభాష్ చంద్రబోస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ సుబ్బారెడ్డి ఎన్నికల బదిలీల్లో అనంతపురం జిల్లాకు వెళ్లారు. చిట్వేలి ఎస్‌ఐగా పనిచేస్తున్న సుభాష్ చంద్రబోస్ బదిలీ నిమిత్తం పెనగలూరు వచ్చారు. ఆయన మాట్లాడుతూ పెనగలూరు మండలాన్ని శాంతియుతంగా ఉండేందుకు కృషి చేస్తానన్నారు.

### సన్మానం


ఎంపీడీఓను సన్మానిస్తున్న అధికారులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు ఎంపీడీఓ వరప్రసాద్ బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళ్లడంతో మండలంలోని వివిధ శాఖల అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ముందుగా ఉపాధి హామీ, అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు.

### ముస్లిం కమిటీ ప్రెసిడెంటుగా నిజాముద్దీన్

నందలూరు(రాజంపేట) : మండలంలోని టంగుటూరు గ్రామంలో నిర్వహించిన ముస్లిం కమిటీ సమావేశంలో నూతన ముస్లిం కమిటీ ప్రెసిడెంటుగా సయ్యద్ నిజాముద్దీన్, సెక్రటరీగా షేక్ తాజుద్దీన్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. ఎన్నికైన ప్రెసిడెంట్, సెక్రటరీలు బుధవారం ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీని వారిని ఘనంగా సన్మానించారు.

### శాంతిరథం వితరణ

చిట్వేలి : మానవత సేవా సంస్థ చిట్వేలి శాఖకు శాంతి రథాన్ని శాఖ ఉపాధ్యక్షులు ఆకేపాటి వెంకటరెడ్డి బుధవారం వితరణగా అందించారు. దాత తల్లిదండ్రులు కీ.శేలు ఆకేపాటి కృష్ణారెడ్డి, ధర్మపత్ని తిరుమలమ్మ జ్ఞాపకార్థం శాంతి రథాన్ని సమకూర్చారు.

### సేవ చేయడమే లక్ష్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : సేవ చేయడమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ అన్నారు. బుధవారం మోడల్ స్కూల్ యూనిట్ – 2 ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల క్యాంపు ముగింపు సభను మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవ ఎలా చేయాలో ఎన్‌ఎస్‌ఎస్ నేర్పుతుందని తెలిపారు. పరీక్ష సమయంలో విద్యార్థులు చేయవలసిన ముఖ్యమైన విషయాలను ఆమె వివరించారు.

**పారిశుధ్య పనులు**

రాయచోటి టౌన్ : రాయచోటి ఎన్‌ఎస్‌ఎస్ వారి ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ పరిధిలోని పలు పాఠశాలలో పారిశుధ్య పనులు చేపట్టారు. గత ఆరు రోజులు పరిసరాలు – పారిశుధ్యం అనే ప్రోగ్రామ్‌లో భాగంగా రాయుడు కాలనీ, చెర్లోపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణలు, బయట ప్రాంతాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పిచ్చిమొక్కలు తొలిగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో పీఓ, ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.